అంగన్‌వాడీల బడిబాట షురూ..

నేటి నుంచి 12 వరకు ప్రణాళికలు సిద్ధం

- రెండున్నర ఏళ్లు పైబడిన చిన్నారుల పేర్లు నమోదుకు కార్యాచరణ
- పిల్లల సంఖ్య పెంచేందుకు క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు, ర్యాలీలు
- అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బృందాలు


అనంతనగర్‌లో బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్నారులను బడిబాట పట్టించేందుకు నేటి నుంచి 12వ తేదీ వరకు అంగన్వాడీ టీచర్లు రోడ్డు బాట పట్టనున్నారు. ఐదేళ్లలోపు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నం చేయనున్నారు. పౌష్టికాహారం, ఆట, పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు. తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో మొత్తం 339 కేంద్రాలు ఉండగా.. 7 నెలల నుంచి 3 ఏళ్ల వరకు 6,905 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు 4,343 మంది మొత్తంగా 11,248 మంది చిన్నారులు ఉన్నారు. వీరితో పాటు వేలాది మంది గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం పొందుతున్నారు. కొత్తగా ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో భాగంగా రెండున్నర ఏళ్ల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులను కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కాగా, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ సహాయక కమిటీలు బృందాలు పిల్లలు నమోదు సంఖ్యను పెంచడానికి దోహదపడతాయి.

ప్రయోజనాలిలా..
అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండున్నర ఏళ్ల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆట, పాటలతో బోధించబడుతుంది. పిల్లల మానసిక, శారీరక వృద్ధి పెరుగుతుంది. వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు ఒక పూట సంపూర్ణ భోజనం, గుడ్డు లభిస్తుంది. సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. ఎల్‌కేజీ పిల్ల లకు తంగేడు పువ్వు, యూకేజీ పిల్లలకు పాలపిట్ట పుస్తకాలు ఉచితంగా అందించనున్నారు.

పాలేరు డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..

మండలం	మెయిన్ కేంద్రాలు	మినీ కేంద్రాలు
ఖమ్మం రూరల్	68	20
తిరుమలాయపాలెం	76	16
కూసుమంచి	62	33
నేలకొండపల్లి	59	5
మొత్తం	265	74

చేపట్టనున్న కార్యక్రమాలు..

మొదటి రోజైన బుధవారం నాడు కేంద్రాల్లో అన్నప్రసన్న, 8న అక్షరాభాస్యం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 10న వేల్ బేబీ షోతో పాటు గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్, 11న చిన్నారుల కాంపిటిషన్ పోటీలు నిర్వహించి చివరి రోజైన సోమవారం నాడు ఇంటింటా క్యాంపెయిన్‌తో విస్తృత ప్రచారం చేయనున్నారు.

పిల్లల నమోదు పెంచుతాం..


కేంద్రాల్లో పిల్లల నమోదు పెంచుతాం. బడి ఈడు చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రాథమిక విద్యలో భాగంగా ప్రత్యేక బోధన చేపడతాం. బడి బాట ద్వారా చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటా తిరిగి లక్ష్యాన్ని చేరుకుంటాం.

– బాలా త్రిపుర సుందరి, సీడీపీఓ, తిరుమలాయపాలెం ప్రాజెక్ట్

ఆట పాటలతో బోధన..


కేంద్రంలో ఆట పాటలతో బోధన చేస్తున్నాం. కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమంలో రాజీపడకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– బచ్చలకూరి నిర్మల, కోరట్లగూడెం అంగన్‌వాడీ టీచర్

మరింత బలోపేతం చేయాలి..


అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలి. బడిబాట కార్యక్రమం ద్వారా విస్తృత ప్రచారం చేయాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి.

– ఈవూరి సుజాత, చెరువుమాధారం, సర్పంచ్

క్లుప్తంగా

కలెక్టర్ అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: కళ్లకు గంతలు కట్టుకుని ఏకధాటిగా ఇరవై గంటల పాటు కీబోర్డు(సంగీత పరికరం) వాయించిన విద్యార్థిని బొల్లిన జిష్ణును మంగళవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అభినందించారు. ఖమ్మంకు చెందిన బొల్లిన రామకృష్ణ–ప్రత్తిగడప అనురాధ కుమారుడు జిష్ణు సర్వజ్ఞ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుండగా ఆయన ప్రతిభకు గాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ బాధ్యులు ప్రశంసాపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయనను కలెక్టర్ అభినందించగా జి.అశోక్, నరసింహరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని టేకులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఖమ్మం అర్బన్ విద్యుత్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు చైతన్యనగర్, టేకులపల్లి, ఖానాపురం, టేకులపల్లి డబుల్ బెడ్రూం, వైఎస్ఆర్ నగర్, పారిశ్రామిక ప్రాంతం, వెలుగుమట్ల తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగ దారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేషన్ డీలర్ల సమ్మె విరమింపజేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రేషన్ డీలర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే పరిష్కరించి వారు చేపట్టిన సమ్మెను విరమింపజేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు ఇవ్వాల్సిన కమిషన్ వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం ప్రకటించాలని, రేషన్ దుకాణాల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు అందించాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబును కలిసిన జిల్లా టీడీపీ నేతలు


చంద్రబాబుతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఖమ్మంఅర్బన్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ హైదరాబాద్‌లో జిల్లా టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో పార్టీ రాజకీయ పరిస్థితిపై చర్చించాక రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ రమణ వాసిరెడ్డి రామనాథంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ అబ్జర్వర్ శ్రీ కూరపాటి వెంకటేశ్వర్లు, పార్లమెంట్ నాయకులు గుత్తా సీతయ్య, వట్టికొండ మోహన్‌రావు, బెజ్జం రాయప్ప తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల బారి నుంచి కాపాడండి..

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంలో వీధికుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి పొన్నం మురళి తెలిపారు. మంగళవారం ఈ మేరకు పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపి కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులతో పాటు రోడ్డున పోయే వాహనదారులను వెంబడించడంతో గాయాలపాలవుతున్నారని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, ఏ. హరీష్, చాంద్, సందీప్, భాస్కర్, నవీన్, పుల్ల య్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	34	పాలకూర	3
పచ్చిమిర్చి	60		10
కాకర	54	చుక్కకూర	2
సొరకాయ	20		10
బీర	50	తోటకూర	2
దొండ	38		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	24	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	50		15
క్యాప్సికం	70	–ఖమ్మం వ్యవసాయం	

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: నకిలీ విత్తనాలపై వ్యవసాయాధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల వలన రైతులు ఆర్థికంగా, వ్యవసాయ పరంగా నష్టపోతున్నారని, నకిలీ విత్తనాలను విక్రయించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌లో ముందస్తుగా రైతులు పంటలసాగు చేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తున్నందున అధికారులు కూడా రైతులకు మేలు కలిగేలా వ్యవహరించాలని, రైతును రాజును చేయాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యాన్ని నెరవేర్చడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కూసుమంచి ఏడీఏ విజయచంద్రతో పాటు పలువురు ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

'ఉద్యమ ఆకాంక్షలు తుంగలో తొక్కారు..'


మాట్లాడుతున్న కమ్మకోమటి నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: తెలంగాణ వస్తే తమ బతుకులు మారతాయని ఆనాడు ఉద్యమంలో పాల్గొన్న వారి ఆకాంక్షలు, ఆత్మ బలిదానాలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనం కోసం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కమ్మ కోమటి నాగేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలు లేక, రైతాంగం అప్పులు తీరక అల్లాడుతుంటే ప్రభుత్వం సంబురాల పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ఈమేరకు తెలంగాణ ప్రజా ఆకాంక్షల దీక్ష దివస్‌ను నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివలింగం, బండెల వెంకయ్య, సోమనపల్లి వెంకటేశ్వర్లు, భానోతు శంకర్, చిరంజీవి, జయమ్మ, ఉన్నం వెంకటేశ్వర్లు, చంటి, మధు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పింజరమడుగులో ఆంబోతు మృతి

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని పింజరమడుగు గ్రామానికి చెందిన ఓ ఆంబోతు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆంబోతుకు ప్రత్యేక పూజలు చేసి, ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తరలించి గ్రామస్తులు దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు దేవి, గ్రామ రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' ప్రారంభం

నేలకొండపల్లి: అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని ఆజయ్‌తండా పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, సర్పంచ్ బాణోత్ పార్వతి, వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్, సీహెచ్ఓ చావా దుర్గ, పీహెచ్‌వోలు చంద్రశేఖర్, వీరన్న, ఉప సర్పంచ్ తేజావత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న డీఈఈ మన్మథరావు

నేలకొండపల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిపై జరగనున్న ఈ సభకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, సీడీపీఓ బాలా త్రిపుర సుందరీ, ఇరిగేషన్ ఏఈ నరేష్, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

నివాస స్థలాల ఎంపికపై వివాదం

నేలకొండపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిరుపేదలకు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఎంపిక చేసిన స్థలాలతో పాటు లబ్ధిదారుల ఎంపిక కూడా వివాదంగా మారుతోంది. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని నాచేపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం స్థలాన్ని నివాస స్థలాల కోసం ఎంపిక చేశారు. దీంతో గ్రామానికి చెందిన యువత, క్రీడాకారులు భగ్గుమంటున్నారు. వివిధ ఉద్యోగాల కోసం గ్రామ యువత, క్రీడాకారులు క్రీడా ప్రాంగణంలో వ్యాయమం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఇంటి నిర్మాణాలకు స్థలాన్ని ప్లాట్లుగా చేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్లు చేయడానికి తాము ఒప్పుకొనేది లేదని.. ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ దారా ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.

తెలంగాణ 'తేజోమూర్తులు' ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ తెలుగు విభాగం రూపొందించిన తెలంగాణ తేజోమూర్తుల చిత్రపటాల ఫ్లెక్సీని మంగళవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఐటీ హబ్ ప్రాంగణంలో కలెక్టర్ వీ.పీ.గౌతం, మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్సీ తాతా మధు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కొండబాల కోటేశ్వరరావు, ఆర్జేసీ కృష్ణతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు కాళోజీ అవార్డు గ్రహీత, కేయూ ఈసీ సభ్యులు సీతారాం, తెలుగు శాఖాధిపతి డాక్టర్ జె.రమేష్, అధ్యాపకులు ఎం.వీ.రమణ, రవివర్ధన్, నరసింహారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

'బొమ్మ'కు పారిశ్రామిక పురస్కారం..


పురస్కారం అందుకుంటున్న బొమ్మ రాజేశ్వరరావు

ప్రముఖ పారిశ్రామిక వేత్తగా రైస్‌మిల్ అసోసియేషన్ రాష్ట్ర నేత, బొమ్మ విద్యాసంస్థల అధినేత బొమ్మ రాజేశ్వరరావుకు పారిశ్రామిక పురస్కారం లభించింది. మంగళవారం ఖమ్మం ఐటీహబ్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పారిశ్రామిక సదస్సులో రాజేశ్వరరావుకు మంత్రి అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్‌లు ఈ పురస్కారాన్ని అందించి అభినందించారు. రాజేశ్వరరావు వ్యాపార పరంగా, విద్యాపరంగా, సమాజిక సేవా కార్యక్రమాల్లో చేసిన కృషికి ఈ పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, ఎమ్మెల్సీ తాతా మధు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వం, జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా సబ్సిడీ వాహనాలైన జేసీబీ, ట్రిప్పర్లు తీసుకొని ఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్న వాంకుడోతు సురేష్‌కు మంగళవారం పారిశ్రామిక సదస్సులో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశ్రమలశాఖ అందించిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, పరిశ్రమలశాఖ జీఎం అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన సోమనబోయిన రవికుమార్(42) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు సీపీఎం, ఇతర పార్టీల నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు, ఎస్.కోటయ్య, మేకల మల్లిబాబుయాదవ్, కృష్ణ, బోడపట్ల శ్రీనులు రవికుమార్ తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు రవికుమార్ మృతిపై వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/కూసుమంచి: వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి బీజేపీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. అలాగే కూసుమంచిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాలేరు ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాట్లాడారు. వర్గీకరణ జాప్యంతో మాదిగల విద్యార్థులు విద్య, ఉద్యోగ, సంక్షేమ రాజకీయ రంగాల్లో వేలాదిగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఈ నెల 10న మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యాన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో మహాజన నేత మందకృష్ణ మాదిగ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అంజయ్య, మాచర్ల క్రాంతి, రాము, నాయకులు పగిడికత్తుల ఈదయ్య మాదిగ, చింతిరాల నాగభూషణం, తోళ్ల వెంకన్న మాదిగ, సురేష్, నరసింహారావు, శ్రీనివాస్, జనార్దన్, శ్రీను, నాగేశ్వరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


వితరణ చేస్తున్న రమణగుట్ట వాసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ రమణగుట్ట ప్రాంతానికి చెందిన డపుకు చిరంజీవి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాళ్లు, చేతులు పడిపోయాయి. దీంతో రమణగుట్ట ప్రాంత వాసులు మట్టే గురుమూర్తి, బహుజన కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ బత్తుల నగేష్, జలగం ప్రసాద్‌తో పాటు శీలం వివేక్, నాయుడు మంజుల రాము, కత్తుల కిరణ్ శ్రావణ్, నరేష్, వీరభద్రం, ఉపేందర్, భవాని, వీరబాబు తదితరులు స్పందించి వారికి రెండు క్వింటాల బియ్యం, రూ.20 వేల నగదు, రూ.5 వేల కిరాణా సరుకులు, కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో శీలం సాగర్, మట్టే మిత్ర సాహు, బత్తుల ఈశ్వర్, జలగం తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమైఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు తోకల బాబు డిమాండ్ చేశారు. సంఘం ఆవిర్భవించి యాభైఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం సీహెచ్ రామయ్య స్మారక భవనం వద్ద గుండు మాధవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రవాణా రంగ సంస్థ కార్మికుల ఐక్యత కోసమే తమ సంఘం ఆవిర్భవించిందని, ప్రజా రవాణా రంగం ఆర్టీసీలను విస్తరించి, బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్, రామారావు, రాంబాబు, సీహెచ్.సీతారాములు, శివారెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


కామేపల్లి మండలం జింకల్‌బంజరలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం

కూసుమంచి/రఘునాథపాలెం/కామేపల్లి(కారేపల్లి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలనే ఉద్దేశంతో మండలాల్లోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయ బృందాలు బడిబాట కార్యక్రమం చేపట్టారు. మంగళవారం కూసుమంచి మండలం చేగోమ్మ జెడ్పీహైస్కూల్ ఆధ్వర్యాన నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ బీవీ రామాచారి, వి.వెంకటాయపాలెంలో ఎఈఓ ఎం. శ్రీనివాస్, కామేపల్లి మండలం జింకల్‌బంజరలో హైస్కూల్ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు వేమిశెట్టి మోహన్‌దాస్, ఎం.ఉమాశంకర్, ఎస్ఎంసీ చైర్మన్ తిరపయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి: చేగొమ్మలో ఉపాధ్యాయుల ర్యాలీ


రఘునాథపాలెం: వీవీపాలెంలో..

దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: తెలంగాణ మైనారిటీ గురుకులంలో ఖాళీగా పీజీటీ సోషల్, సెక్యూరిటీ గార్డు పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సీతామహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ సోషల్ పోస్టుకు బీఈడీ, పీజీ, సెక్యూరిటీ గార్డుకు పదో తరగతి పాసై ఉండాలని ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 7 నుంచి 10వ తేదీ సాయంత్రం లోగా అల్లిపురం రోడ్డులోని బొమ్మ బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో గల ఖమ్మం మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 79950 57921 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల కాలేజీ–1లో..
నగరంలోని రాపర్తినగర్ టీఎన్జీఓ కాలనీలో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల కాలేజీ–1లో ఇంగ్లిష్ బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబిదానల్మా ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం రెండేళ్ల అనుభవం కలిగి ఎంఏ ఇంగ్లిష్, బీఈడీలో 50శాతం మార్కులు ఉండి 18 నుంచి 44 ఏళ్లలోపు వయస్సు గల మహిళా అభ్యర్థులు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ 73311 70860 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రత దృష్ట్యా నగరంలోని త్రీటౌన్‌లో వర్తక సంఘం భవనం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన మంగళవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు(జీవై నరేష్), కోశాధికారి తల్లాడ రమేష్, దిగుమతి శాఖ అధ్యక్షుడు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు ప్రారంభించగా.. సంఘ ప్రతినిధులు కైలాసపు వేణుగోపాల్‌రావు, పాయల నాగేశ్వరరావు, జంగిలి రమణ, సారిక పాపారావు, బండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.